క్లుప్తంగా

సీపీఎస్ రద్దు చేయాలని ఉపాధ్యాయుల నిరసన



మైతాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

రాయికల్: సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ రాయికల్ మండలం మైతాపూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎస్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి నర్సయ్య మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగులకు మేలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎస్‌తో నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి అంతడుపుల గంగరాజం, నాయకులు వేముల మధు, కల్వకోట కార్తీక్, సిద్దె గంగరాజం, వెనుగంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న నాయబ్ తహసీల్దార్ వరప్రసాద్

రాయికల్: మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉప్పుమడుగు, అయోధ్య అంగన్‌వాడీ కేంద్రాల్లో అధికారులు శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాయబ్ తహసీల్దార్ వరప్రసాద్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఆర్‌ఐ దేవదాసు, పద్మయ్య విద్యార్థులతో కలిసి భోజనాన్ని పరిశీలించి, విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు అల్లె పూజ, తునికి కీర్తన రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ కోటేశ్వర్ రావు తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే యూత్ బాస్కెట్ బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను శుక్రవారం హెచ్ఎం సింగు సత్తయ్య, ఉపాధ్యాయులు భూపతి రావు, సరోజ, అనిత, రజనీకర్ రెడ్డి, రాజేందర్, ప్రకృద్దీన్ అభినందించారు.

రుణమాఫీ కోసం రైతుల దరఖాస్తు



దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

మల్యాల: మండలంలో రుణమాఫీ కాని రైతులు స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటున్నారు. అర్హులైనప్పటికీ రుణమాఫీ కాలేదని రైతులు తెలిపారు. ఆధార్ కార్డుతో పాటు రుణాల వివరాలు అందజేస్తున్నారు. రుణమాఫీ కానీ రైతుల వివరాలే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారి వివరాలు సేకరిస్తున్నామని ఏవో చంద్రదీపక్ తెలిపారు. సంబంధిత వివరాలతో దరఖాస్తు చేసుకుంటే వాటిని వ్యవసాయశాఖ పోర్టల్ నమోదు చేసి రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మండల స్థాయి క్రీడల ఎంపిక పోటీలు

మల్యాల: ఈ నెల 28,29 తేదీల్లో మల్యాల మండల పాఠశాల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. 28న అండర్ 14, 17 విభాగంలో బాలికలకు, 29న, అండర్ -14, 17, బాలురకు తాటిపల్లి గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనాలు



నిరుపయోగంగా హరిజనవాడ అంగన్‌వాడీ భవనం



బీటలు వారిన బీమారం మండలం వెంకట్రావుపేట పాఠశాల గోడలు

మేడిపల్లి: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే విద్యాలయాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. మేడిపల్లి, బీమారం మండలాల్లో పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. బీమారం మండలం వెంకట్రావుపేట ప్రైమరీ పాఠశాలలో మూడు గదులు శిథిలావస్థకు చేరాయి. దీంతో విద్యార్థులను ఒకే గది ఉంచి బోధిస్తున్నారు. మేడిపల్లి మండల కేంద్రంలోని హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరింది. బీమారం మండలంలోని గోవిందారంలో హైస్కూల్ భవనాలు మూడు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇది వరకు ఈ గదుల్లో 7,8,9 వ తరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు. శిథిలావస్థలో ఉన్న గదుల స్థానాల్లో నూతన గదులను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పెచ్చులూడుతున్న అంగన్‌వాడీ భవనం



పెగడపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా, నంది విగ్రహం వద్ద పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు పని చేయడం లేదు. ఏదైనా సంఘటన జరిగితే నిందితులను గుర్తించేందుకు స్థానికుల సహాయంతో వీటిని ఏర్పాటు చేశారు. ఇటీవల రోడ్డు వెడల్పు చేసిన సమయంలో కేబుల్ వ్యవస్థ దెబ్బతింది. పోలీస్ అధికారులు స్పందించి సీసీ కెమెరాలు పనిచేసేలా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి సీహెచ్ రవికిరణ్, ఎస్సై, 8712656832

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 94400 61630

ఆడబిడ్డలకు చీరలు ఎప్పుడిస్తారు?

• కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: బతుకమ్మ పండగ అంటేనే ఆడబిడ్డలకు ఎంతో ఇష్టం. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతీ ఆడబిడ్డకు చీరలు అందించేశారు. కనీసం ఇప్పుడు ప్రభుత్వం ఆర్డర్ సైతం చేయలేదని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. కలెక్టరేట్‌లో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆడబిడ్డలను విస్మరిస్తోందని, వారికి చీరల కోసం ఆర్డర్ అయినా ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆడబిడ్డలకు చీరలు అందించేలా చూడాలని కోరారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులున్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

ఇబ్రహీంపట్నం: పేదలకు వరం , సీఎం రిలీఫ్‌ఫండ్ అని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని 14 గ్రామాల్లో 74 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందేందుకు తర్వాత సాయం అందించేందుకు గాను సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బాధితులు వైద్యం చేసుకున్న తర్వాత బిల్లులను అందజేస్తే సీఎం రిలీఫ్‌ఫండ్‌ను మంజూరు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ



మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

సోముల లక్ష్మారెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ జిల్లాల పవన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్‌రెడ్డి, నాయకులు జేడీ సుమన్, జాజాల జగన్‌రావు, జగన్, రవికాంత్‌రెడ్డి, పుప్పాల నర్సయ్య, తుకారం, రాజన్న, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

జగిత్యాల: కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ శుక్రవారం కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిశారు. కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



జీవో 28 ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకిచ్చిన హామీ మేరకు నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్, టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తుంగూరి సురేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో కలిసి జీవో 28 ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు మొగులూరి నరేశ్, పబ్బ అనిల్, మండల ప్రధాన కార్యదర్శి బబ్బూరి రాజేందర్, ఈర రవీందర్, టీఆర్టీఎఫ్ మండల కార్యదర్శి రాజారత్నం, నాయకులు మహిపాల్, నర్సయ్య, రామన్, నిరంజన్, భాస్కర్, శివరాం, గోవర్ధన్, వేణు, సత్యం, సౌజన్య, దివ్య, స్రవంతి పాల్గొన్నారు.

జీవో 28తో ఉద్యోగుల భవితకు ఉరి

ధర్మపురి : జీవో 28తో ఉద్యోగుల జీవితాలకు ఉరివేసినట్లేనని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ధర్మపురి మండల నాయకులు బండారి సతీశ్, తాండ్ర సుధాకర్ కోరారు. ఉద్యోగుల జీవితాలను నాశనం చేసే నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం దొంతాపూర్ జెడ్పీ హై స్కూల్‌లో ఆగస్టు 23 బ్లాక్‌డే సందర్భంగా జీవో 28 కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సతీశ్, సుధాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులతో సంప్రదించకుండానే సీపీఎస్ విధానం కొనసాగిస్తామని 2014 ఆగస్టు 23 న జీవో 28 ద్వారా ఉత్వర్వులు ఇచ్చి ఉద్యోగుల నోట్లో మట్టి కొట్టారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వానికి నివేదించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ముత్యం బుచ్చన్న, ఉపాధ్యాయులు రవి, సరిత, స్రవంతి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. .



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

'బూటకపు ధర్నాలు మానుకోవాలి'

కోరుట్ల: బీఆర్ఎస్ నాయకులు రుణమాఫీ పేరిట బూటకపు ధర్నాల పేరిట రైతులను పక్కతోవ పట్టించే యత్నాలు మానుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన కోరుట్లలోని జువ్వాడి భవన్‌లో మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో రుణమాఫీలో వచ్చిన చిన్నపాటి సమస్యలను ఎత్తిచూపుతూ పనికిమాలిన ధర్నాలు చేయడం బీఆర్ఎస్ నాయకులకే చెల్లిందన్నారు. రుణమాఫీ పొందిన నాయకులు సైతం ధర్నాలో పాలుపంచుకోవడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే సంజయ్ చేస్తున్న ధర్నాలను రైతులు నమ్మరని పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్కనాడు రైతులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఆనాడు షుగర్ ఫ్యాక్టరీ మూయించి ఇప్పుడు రైతులకు రుణమాఫీ కాలేదని మొసలి కన్నీరు కార్చడం విడ్డూరమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గంగాధర్, సత్యనారాయణ, సంగ లింగం, రషీద్, సజ్జు , మ్యాకల నర్సయ్య, బన్న రాజేశ్, ఎంబేరి సత్యనారాయణ, సోగ్రాబీ, దివాకర్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

నీరటి రోబో సృష్టికర్తకు అభినందన



గవర్నర్ చేతుల మీదుగా సత్కారం అందుకుంటున్న శ్రీనివాస్

మల్లాపూర్: ప్రభుత్వానికి, రైతులకు మేలు చేకూరే విధంగా నీరటి రోబో పరికరాన్ని సృష్టించిన మెండె శ్రీనివాస్‌ను త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జెఎన్టీయూలో నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ పంక్షన్‌లో కర్నాటక వైస్‌చాన్సలర్ బట్టు సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ.రమణమూర్తిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు సన్మానం



ఎమ్మెల్సీ సన్మానిస్తున్న నాయకులు

మల్లాపూర్: హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ జనసమితి పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్ ఆత్మీయ సమ్మేళనంలో శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్కా కమలాకర్ పాల్గొని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో టీజేఏసీ చైర్మన్‌గా ప్రొ.కోదండరామ్ చేసిన పోరాటం ప్రజల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని కొనియాడారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



చిట్టాపూర్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వాహిని

మల్లాపూర్: సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్, మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని అన్నారు. మండలంలోని చిట్టాపూర్, పాతదాంరాజుపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన హెల్త్ క్యాంప్‌లో గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యసూత్రాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణకు స్ప్రే చేయించాలని సూచించారు. అనంతరం జ్వరపీడుతల రక్తనమునాలను సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో రామ్మోహన్, హెచ్ఈవో వేణురావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీలు దేవిప్రసన్న, పద్మ, ఏఎన్ఎంలు విజయ, సుశీల, పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వలస జీవుల జీవితాలకు భరోసా ఏదీ?



లేబర్ ఆఫీసర్‌కి వినతిపత్రం ఇస్తున్న కైలాసం

వెల్గటూర్ : వలస కార్మికుల జీవితాలకు భరోసా లేకుండా పోయిందని దళిత బహుజన లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొంకూరి కైలాసం అన్నారు. శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ లేబర్ ఆఫీసర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన ఎండపల్లి మండలం మారేడ్‌పల్లిలోని లక్ష్మి గణపతి క్వారీలో బీహార్ వలస కూలీ కుందన్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి రూ. 30 లక్షలు పరిహారం చెల్లించి, క్వారీని సీజ్ చేయాలని కరీంనగర్ లేబర్ ఆఫీసర్‌కు చేసిన ఫిర్యాదులో కోరారు.

రైతే దేశానికి వెన్నెముక



భూమిపూజ చేస్తున్న అఖిల పక్ష నాయకులు

మల్లాపూర్: రైతే దేశానికే వెన్నెముక అని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కాసారపు భూమారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో శుక్రవారం కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, రైతులు కలిసి బలరామ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ వ్యవసాయానికి ఆరాధ్యుడు బలరామ దేవుడన్నారు. బలరామ దేవుడు అవలంభించిన వ్యవసాయ విధానాలతోనే భారతదేశం వ్యవసాయానికి పుట్టిల్లుగా ప్రసిద్ధి పొందిందన్నారు. పాలకులు వ్యవసాయం, రైతు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడంతో పాటు పంటలకు గిట్టుబాటు ధరలను కల్పిస్తే రైతును రాజు చేయడమనే లక్ష్యం నేరవేరినట్లేనన్నారు. కార్యక్రమంలో కిసాన్‌సంఘ్ జిల్లా కార్యదర్శి ఇప్ప రాజేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కళ్లెం మహిపాల్‌రెడ్డి, చెరుకు విభాగం జిల్లా ప్రముఖ్ న్యావనంది లింబారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన కొండూరి లావణ్యకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొగళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, రాజు, కోటి తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్ లెట్ల దానం

మేడిపల్లి: తనతో చదువుకున్న చిన్ననాటి మిత్రుడు అంజిరెడ్డి తీవ్ర జ్వరంతో రక్తకణాలు తగ్గి ప్రాణాపాయస్థితిలో బాధపడుతుండగా ప్లేట్‌లెట్స్ అత్యవసరంగా కావాలని డాక్టర్లు తెలిపారు. కుటుంబీకులు సోషల్‌మీడియా వేదికగా ప్లేట్‌లెట్స్ కావాలని గ్రామస్తులతో పాటు, తెలిసిన వాళ్లను అర్థించారు. విషయం తెలుసుకున్న కట్లకుంటలో ప్రాథమిక వైద్యుడిగా సేవలందిస్తున్న మాజీద్ జగిత్యాల వెళ్లి చిన్ననాటి మిత్రుడికి ప్లేట్‌లెట్స్ ఇచ్చి నిండు ప్రాణాన్ని కాపాడాడు. మానవత్వాన్ని మించిన మతం లేదని చాటి చెప్పాడు మాజీద్ ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఏఈవోకు సన్మానం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల క్లస్టర్ పరిధిలో ఏఈవోగా పనిచేసిన రాజేశ్ బదిలీపై కొడిమ్యాల మండలం పూడూరుకు బదిలీ కాగా, శుక్రవారం రైతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఏలేటి రాజేందర్‌రెడ్డి, మండ రమేశ్, కంటె గంగారాం, తోట రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

రాయికల్: పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా పట్టణంలోని పలు వార్డులను సందర్శించి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పట్టణ ప్రజలకు వివరించారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

గొల్లపల్లి: హాస్టల్‌లో ఉండి చదవడం ఇష్టం లేక ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థిని చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని గోవిందుపల్లికి చెందిన బద్దం హర్షితరెడ్డి(14) జగిత్యాలలోని ఓ ప్రైవేట్ స్కూల్ హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతోంది. హాస్టల్ ఉండి చదువుకోలేనని మనస్తాపం చెంది ఈ నెల 21న ఇంట్లో గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు జగిత్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రి, అక్కడి వైద్యుల సూచన మేరకు ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. మృతురాలి తండ్రి అజిత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడికేసులో ఇరువర్గాలపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలో హనుమాన్‌వాడలో గురువారం రాత్రి దాడికి పాల్పడ్డ ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన సుద్దాల ప్రశాంత్, ఆయన అల్లుడు హర్షవర్ధన్ సోదరుడు మహేందర్‌పై గురువారం రాత్రి జగిత్యాల హౌసింగ్‌బోర్డుకు చెందిన కొత్తకొండ వినీత్, బబ్లూ, మనోజ్‌తో పాటు, మరో నలుగురు వ్యక్తులు దాడిచేసి గాయపర్చారు. దీంతో ఈ దాడిలో ప్రశాంత్, హర్షవర్ధన్, మహేందర్‌లకు గాయాలయ్యాయి. దాడికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తెలిపారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



కేజీబీవీలో విద్యార్థినుల ప్రదర్శన

రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు రంగోలీ, చిత్రలేఖనం, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.